# విరిగిన రథచక్రాలు

హాస్టల్ కిటికీనుండి బయటికి...దూరంగా కొండల్లోకి చూస్తూ ఉండిపోయాడు శివకుమార్.

అతని మనసు కాళ్ళువిరిగిపోయిన రేసుగుర్రంలా ఉంది. రేసు గుర్రానికి ఎప్పుడూ పరుగెత్తాలనే ఉంటుంది. కాని కాళ్ళు విరిగిపోతే...ఛ్ఛ...మిగిలేది ఒట్టిస్తబ్దత...అశక్తత...నిస్సహాయత.

యిన్నాళ్ళూ...తను బుద్ధెరిగిన ప్రైమరీస్కూల్ చదువుదగ్గరి నుండి యివ్వాల్టి యీ యం.బి.బి.యస్. చివరిరోజుదాకా...ఒంటరిగా ఏ దిక్కూ-లేనివానిగా, పుస్తకాలే జీవితంగా బ్రతికి బ్రతికి—

అసలు తనెవ్వరు. ఎవరికి సంబంధించిన మనిషి తను. తను ఎవరికోసం బ్రతుకుతున్నాడు. ఎవరికోసమని తనను ఇంతవాణ్ణి చేస్తున్నారు.

యివన్నీ ప్రశ్నలు...ప్రశ్నలు. జవాబులేని ప్రశ్నలు...జవాబు తెలియని ప్రశ్నలు.

గది నిశ్శబ్దంగా, భయంకరంగా, సముద్రం అడుగులా ఉంది.

"టక్...టక్...టక్" తలుపులు కొడుతున్నారెవరో.

వెళ్ళి తలుపులు తెరిచాడు. పోస్ట్‌మాన్.

"నమస్తే...మీపేర ఓ.యమ్.ఓ. ఉంది."

"అలాగా—కూర్చోండి" హాంగర్‌కు వేసిఉన్న పాంటుజేబు నుండి పెన్ను తెచ్చుకున్నాడు.

సంతకంచేస్తూ ఫాంపై ఉన్న అంకెలు చూశాడు. నాల్గువందలు అంటే యిదివరకు మామూలుగావచ్చే డబ్బుకన్నా వందరూపాయ లెక్కువ. యీసారి ఎక్కువడబ్బు ఎందుకు పంపినట్లు.

నోట్లు లెక్కబెట్టుకుంటూండగా పోస్ట్‌మాన్ ఇంకో కవరు అందించాడు. ఓ రూపాయి మామూలు యిచ్చేసి కవరు చించిచూస్తే.

చిరంజీవి శివకుమార్ కు,

యిదివరకుపంపే డబ్బుకన్నా ఇంకో వందరూపాయలు ఎక్కువ పంపుతున్నానీసారి. ఎందుకంటే నీ కాలేజీచదువు యింకో వారంరోజుల్లో ముగియబోతోంది. యిన్నాళ్ళూ గాలిలో పక్షిలా స్వేచ్ఛగా బ్రతికిన నువ్వు యిక నీ అసలైన జీవితంలోకి అడుగుపెట్టబోతున్నావు. ముళ్ళ బోనులో సాముచేయడానికి సిద్ధపడాల్సి ఉంది నువ్వు. అందుకని యిక యీ వారంరోజుల్లో నీ అపురూపమైన. న్యాయమైన కోరిక ఏదైనా ఉంటే తీర్చుకో. ఓ డ్రెస్ కుట్టించుకో. నువ్వు దొరబాబులా మా కంటికి కనబడాలి. మొట్టమొదటిసారిగా....యీ యిరవై రెండేళ్ళ తర్వాత ఎన్నో ఆశలతో నీఎదుటికి రాబోతున్న మాకు సంతోషాన్ని పంచాలి నువ్వు. నీ కన్నుల్లో వెలిగే వెలుగును తృప్తిగా చూచుకుని కన్నుమూయాలనుకుంటున్న మాకు నిన్ను చూడాలని ఎంతో ఆరాటంగా ఉంది. కాని రేపటినుండి పరీక్షలుంటాయి నీకు. యింకో వారంరోజులుంది యీ ఎడబాటు...సరే....నిన్ను బాగా చదువుకొమ్మని యిప్పుడు ప్రత్యేకంగా చెప్పను. నువ్వు చదువుతావు యూనివర్సిటీలో ఫస్ట్ వస్తావు. ఆ విషయం మాకు తెలుసు. నీ ఆఖరి పరీక్షనాటికి యింకో ఉత్తరం రాస్తాను. దాంట్లో నువ్వెప్పుడు, ఎక్కడ మమ్మల్ని కలుసుకోవాలో రాస్తాను. ఉండనా మరి.

నీ

శ్రేయోభిలాషి

శివకుమార్ తలెత్తేసరికి పోస్ట్‌మాన్ వెళ్ళిపోతున్నాడు సైకిల్ మీద.

ఎవరీ శ్రేయోభిలాషి. ఎందుకు తనను కన్న కొడుకుకన్నా మిన్నగా చూసుకుంటున్నాడు. తనకు తెలియకుండా, తనకళ్ళకు కనబడకుండా, తననుండి దూరంగాఉంటూ ఎందుకు తనను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు.

యింతప్రేమనూ, మమతానురాగాలనూ తనపై పెంచుకుని అసలా మనిషి తననుండి దూరంగా ఎలా ఉండగలుగుతున్నాడు.

ఒక్కరోజా...రెండురోజులా...యిరవై రెండు సంవత్సరాలు తనను విడిచి_తను పుట్టిననాటినుండి యీనాటిదాకా తనకంటపడకుండా ఎందుకు యీ అజ్ఞాతవాసాన్ని అనుభవిస్తున్నారు వీళ్ళు.

యిలా ఉండడానికి వెనుకఉన్న బలమైన కారణం ఏమిటి.

అసలీ శ్రేయోభిలాషి తనకేమి కావాలి. తనను కన్నవాడా. తనతో రక్తం పంచుకుని పుట్టినవాడా. తన బంధువర్గంలోని ఎవరైనా సహృదయుడా.

సరే_అతను ఎవరైనా తనపట్ల ఇలా రహస్యంగా ఉండాల్సిన అవసరం ఏమిటి...?

అసలా మనిషి అతనా...ఆమెనా.

ఎవరైనా....తనకు ఏ లోటూ రాకుండా, ఏ కష్టమూ కలగకుండా అజ్ఞాతంగా ఉంటూనే అన్ని అవసరాలనూ తీర్చుతూ, నీడలా వెన్నంటి ఉంటూఉన్న ఆ వ్యక్తి తనపట్ల దేవత. దేవత....

తను ఒంటరిగా ఉండలేకా, మమతానురాగాలకోసం తపించిపోతూ, తోటి విద్యార్థుల తల్లిదండ్రుల ఆదరణను చూచి తనక్కూడా ఆ అదృష్టం

కావాలని తహతహలాడిపోతూ–ఎన్నోసార్లు తను ఆ శ్రేయోభిలాషికోసం వెదికాడు. ఎంతో తీవ్రంగా ఆరాతీసి గాలించాడు మనసు అలసిపోయే దాకా అతన్ని కలుసుకోడానికి ప్రయత్నించాడు.

కానీ ఎన్నడూ ఆశ ఫలించలేదు. కోరిక తీరలేదు.

తను ప్రైమరీ స్కూల్‌లో ఉండగా నర్సరీలో ఎవరో చేర్పించి వెళ్ళారుట. తనకప్పటిసంగతి జ్ఞాపకంలేదు. ఏదో అనాధాశ్రయంలో నుండి తన పోషణ వ్యవహారాలన్నీ సక్రమంగా జరిగేవట. ఏ నెల ఫీజు ఆ నెల తప్పకుండా ఎమ్ ఓ.లో అందేవుట.

తర్వాత—

తనకు కొస్త ఆలోచించే జ్ఞానం వచ్చేనాటికి కాన్వెంట్‌లో పర్మెనెంటు హాస్టలర్‌గా ఉన్నాడు.

హాస్టల్ మాట్రిన్....అక్కడి నౌకర్లు....అక్కడి మనుషులు... అక్కడి తోటి విద్యార్థులు—వీళ్ళే లోకం...వీళ్ళే తన సహచరులు... మిత్రులు ఆప్తులు, ఆత్మీయులూ, అన్నీ—

అందరు విద్యార్థులకున్నట్లు, తనకు తల్లిదండ్రులున్నారో తెలియదు. ఉంటే వాళ్ళ ఉనికేమిటో తెలియదు. అసలు లేరా అన్న సంగతి అంతకూ తెలియదు. కాని తను బుద్ధెరిగిన నాటినుండి మాత్రం ప్రతి రెండో తారీఖున తప్పకుండా మనీఆర్డర్ అందేది. తన కా నెల ఎంత అవసరముంటుందో ఏదో ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా తెలుసు కున్నట్టు సరిగ్గా సరిపోయేంత డబ్బు అందుతూండేది.

దాంతోపాటు ఎప్పుడూ "చిరంజీవి శివకుమార్ కు–మా ప్రాణాలను నీపై పెట్టుకుని నిన్ను పెంచుకుంటున్నాం. నువ్వుబాగా చదువుకుని మా ఆశలను నెరవేర్చు" అనిమాత్రం వుండేది.

ఎవరి ప్రాణాలు తనపై ఉన్నాయో....ఎవరి ఆశలను నెర

వేర్పాలో అసలే అర్థంగాకపోయేది.

కాని తనను మనిషిగా తీర్చిదిద్దాలన్న గొప్ప ఆశయంతో ఎవరీ పని చేస్తున్నా వాళ్ళ నిష్కల్మషమైన ప్రేమ మాత్రం నిరంతరం అశరీరవాణిలా తన వెన్నుతట్టేది. తనలో కొత్త ఊపిరి నూదేది. ఏదో మొండిపట్టుదలను గుండెల్లో పొంగించేది.

పుస్తకాలు ... పుస్తకాలు .... చదువు ... చదువు .... అదే ప్రపంచం.

కాని ఎన్నాళ్ళిలా_అసలు తనెవరు...ఎవరు...ఎవరు.

ఓ ఎండాకాలం సెలవుల్లో దర్యాప్తు ప్రారంభించాడు శివకుమార్.

కాలేజిలో, స్కూల్‌లో, తన అన్ని సర్టిఫికేట్స్‌పైనా తన తండ్రి పేరు నరసింహం అనివుంది. తనకు వస్తున్న మనీఆర్డర్స్ అన్నీ నరసింహం పేరుగల వ్యక్తి దగ్గరినుండే వస్తున్నాయి. కాని స్కూల్లో ఉన్నప్పుడు అవి వరంగల్‌నుండి యమ్.ఓ. చేయబడి వచ్చేవి. తర్వాత హైద్రాబాద్‌నుండే రకరకాల చోట్లనుండి రకరకాల అడ్రస్‌లనుండి బుక్‌చేయబడివచ్చాయి.

వరంగల్ అడ్రస్ తెలిసిననాడే ఓ ఉత్తరం రాశాడు. కాని అది ఓ వారంరోజుల తర్వాత "రాంగ్ అడ్రస్_అన్ డెలివర్డు" అని తిరిగొచ్చింది. ఐతే తను యమ్.ఓ.లో ఉన్న అడ్రస్ ప్రకారం సరిగ్గానే రాశాడు. కాని నరసింహం అన్న వ్యక్తి అక్కడలేడు. కాక యిచ్చిన అడ్రస్ తప్పు అడ్రసైవుండొచ్చు. సరే_ఓసారి శివకుమార్ స్వయంగానే కోటిఆశలతో వరంగల్ వెళ్ళి వాకబు చేశాడు. ఏ కొద్దిగానైనా ఆచూకీ తెలియకపోతుందా, తను తన తండ్రిని కలుసుకోలేకపోతాడా అన్నది అతని ఆరాటం.

కాని అడ్రస్‌లోని యింటినంబరున్న యింట్లో ఎవరో వేరే ఉన్నారు. ఏదో జవాబు చెప్పారు. నరసింహం అనబడే మనిషి ఎన్నడూ ఆ వాడలోనే లేనట్లూ ఆ యిల్లు కట్టిన నాటినుండి తాను అందులో ఉంటున్నట్లూ చరిత్రనంతా విప్పి కుమ్మరించారు.

అడ్రస్ తప్పు .... మనిషిపేరు తప్పు. కాని యమ్.ఓ.లు వస్తున్నది మాత్రం నిజం.

తను వరంగల్‌లో ఎంక్వయిరీచేసి తర్వాత మనీఆర్డర్‌లోని ఫ్రమ్ అడ్రస్ హైద్రాబాద్‌కు మారింది. యిదివరకు నరసింహంనుండి పంపబడుతున్న డబ్బు యిప్పుడు వివిధపేర్లలో, శ్రేయోభిలాషి ఉత్తరంతో రావడం మొదలెట్టాయి. ఫాంపై రాత కూడా మారింది.

సరే_ఆ శ్రేయోభిలాషిని పట్టుకుని కాళ్లు మొక్కడానికి కొన్ని పోస్టాఫీస్‌లను వాచ్ చేశాడు శివకుమార్ కొన్ని నెలలు....ప్చ.... ఆ ప్రయత్నమేమీ ఫలించలేదు. తిరిగి తిరిగి_విసిగి విసిగి_శ్రేయోభిలాషి హెచ్చరికతో మళ్ళీ చదువులోకిజారి....మళ్ళీ పుస్తకాలు....పుస్తకాలు.

కాని హృదయం చీముపట్టిన పుండులా సలిపేది బాధతో.

స్నేహితులతో చెప్పుకుందామంటే యిదో మిస్టరీ కథవుతుంది. సస్పెన్స్ సినిమాలోని ఓ థ్రిల్‌లా తయారవుతుంది అటీగాక ఎవరూ తన బాధను అర్థంచేసుకోరు. అపహాస్యం పాలుచేస్తారు. అటీగాక చెప్పుకోవడంవల్ల ప్రయోజనం ఏమీలేదు నలుగురి నోళ్ళలో నానడం తప్పితే.

పోలీస్ రిపోర్టిస్తేనో_అనుకున్నాడు శివకుమార్ చాలాసార్లు.

దానివల్ల శ్రేయోభిలాషి తప్పకుండా పట్టుబడతాడు. కాని తర్వాత జరిగేదేమిటి....అతను ఏదో బలమైన కారణముంటేనే తన నుండి అజ్ఞాతంగా ఉంటున్నాడు. దేన్నో సాదించడంకోసం మనస్సును

చంపుకుని తనకోసం పాటుబడుతున్నాడు. అతనికి మాత్రం తనని చూడాలనీ, తనతో మాట్లాడాలనీ ఉండదా. తనను కలవాలని అతనికి మాత్రం ఆతురతఉండదా, ఉంటుంది. తప్పకుండా ఉంటుంది మరి అలాంటప్పుడు పోలీస్ రిపోర్టిస్తే తను అతని హృదయాన్ని గాయ పరచినవాడు కాడా.

ప్చ ....కర్తవ్యం తోచక...తహ తహ చావక...తన గురించి తను తెలుసుకోవాలన్న ఆరాటం ఆరిపోక...ఒట్టి నిస్పృహాయతతో. ఉత్కంఠతతో కృంగిపోయి యిన్నేండ్లు శిలలా గడిపాడు తను.

శివకుమార్ చేతిలోని ఉత్తరాన్ని మళ్ళీ చదువుకున్నాడు

"నీ ఆఖరి పరీక్షనాటికి యింకో ఉత్తరం రాస్తాను. దాంట్లో నువ్వెప్పుడు. ఎక్కడ మమ్మల్ని కలుసుకోవాలో రాస్తాను."

పదిసార్లు చదువుకున్నాడావాక్యాన్ని. అతని గుండెల్లో సంతోషం చిచ్చుబుడ్డిలోనుండి కాంతిలాచిమ్ముకొస్తోంది.

అంటే....యింకా ఒక్కవారం....ఒకే ఒక్కవారం.... ఏడు రోజులు-ఏడు యుగాలు.

అబ్బా....కాలాన్ని బంతిలా ఎగురదన్నితే ఎంత బాగుండును. ఏడురోజులు గడిస్తే...తనువాళ్ళని కలిసి....వాళ్ళను తెలుసుకుని—

అసలు .... యీ శ్రేయోభిలాషి తన తండ్రేనా. కాక యిం కెవరన్నానా....ప్చ....ఏమో.

శివకుమార్ కళ్ళు మూసుకున్నాడు సంతోషంగా...తృప్తిగా.

✻ ✻ ✻

చివరి పరీక్ష రాసి హడావిడిగా వచ్చాడు శివకుమార్. గదికి రాగానే...తలుపులు తెరువగానే నేలపై పోస్టుమాన్ పడేసిపోయిన కవర్ కనిపించింది.

కవర్.... కవర్.... కవర్,

యిరవై రెండేళ్ళనుండి దాచిన రహస్యాన్ని బయటపెట్ట బోతున్న కవర్ తనపాలిటి శాప విముక్తి లాంటికవర్ విజాన్ని చెప్పబోయే కవర్.

గబగబా విప్పాడు ఉరకలేస్తున్న హృదయంతో.

తననుకున్నట్టు పేజీలకొద్దీ పొడగాటి ఉత్తరం లేదులోపల. ఒక చిన్న కాగితం ఉంది దీనిపై రెండే రెండు వాక్యాలు.

చిరంజీవి శివకుమార్ కు,

యివ్వాల్టితో నీ పరీక్షలు ఐపోయాయి. యిక యిప్పుడు నువ్వు విజాన్ని తెలుసుకోవడం అవసరం. అందుకని రేపు ఉదయం ఏడు గంటలకు త్రిపురసుందరి సత్రానికిరా. నీకోసం ఎదురుచూస్తుంటాం.

నీ నాన్న
నరసింహం.

ఎదురుచూస్తుంటాం-అంటే ఎదురుచూ చేది ఒక్కడుకాదా. ఎక్కువమందే వాళ్ళంతా ఎవరు. అంటే తనకు అమ్మ, నాన్న, అక్క, చెల్లెలూ-అందరూ ఉన్నారా.

యీసారి నీ శ్రేయోభిలాషికిబదులు నీ నాన్న అని రాశాడు.

ఎంత సంతోషం. తనకు తండ్రి ఉన్నాడన్నమాట ఐతే ఒహ్!

తండ్రి...తండ్రి...తండ్రి.

నాన్నను ఊహించుకుంటే మనసు ఎంత తేలిగ్గా, హాయిగా ఉంది గాలిలో తేలిపోతున్న కాగితంలా

తను అతన్ని చూచి పరవశించిపోయి సంతోషంతో ఉక్కిరి బిక్కిరై పోయి, మూగవాడై పోయి, కళ్ళనిండా నీళ్ళతో సముద్రంలా

పొంగి-పరుగెత్తి తండ్రి కౌగిట్లో వాలిపోయి, కాళ్ళను చుట్టుకుపోయి.... యిన్నేళ్ళూ తననుండి దూరంగా వుండిపోయిన దైవాన్ని కన్నీళ్ళతో కడిగి-ఆ క్షణం ఎంత మధురంగా ఉంటుంది....ఎంత రమ్యంగా ఉంటుంది.

కాని — రేపు .... రేపు ... యింకా ఎన్ని గంటలు ... ఎన్నో గంటలు....ప్చ్.

ఐతే-వీళ్ళు సత్రంలో ఉండడమేమిటి అక్కడెందుకుంటున్నారు. సత్రంలో ఉండాల్సిందెవరు-ఐనా సత్రంలో ఉంటున్నారా సత్రం దగ్గర్లో ఎక్కడైనా ఉంది తనకు సులభంగా రావడానికి సత్రాన్ని గుర్తుగా చెప్పారా.

ప్చ్-ఏమో....ఎక్కడున్నా తను పోవాలి...పోవాలి....అంతే.

త్రిపురసుందరి సత్రం గురించి తను విన్నాడు. కానిఎన్నడూచూడ లేదు అక్కడెక్కడో రాజబహద్దూర్ రోడ్ ప్రక్కన ఉండాలది-శివ కుమార్కు తను అనంతస్వర్ణనిధులను పొందబోతున్నట్లుగా ఉంది. యింకొన్ని గంటల్లో తను ఓ దేశానికి ప్రధానమంత్రి కాబోతున్నట్టుగా ఉంది. సాయంత్రందాకా సంతోషంగా గడిపాడు ఎవరెవరితోనో. రాత్రంతా కలలతో నలిగిపోయాడు.

తెల్లవారింది-తన జీవితానికి.

స్నానం ముగించుకుని ... ఉన్నవాట్లో మంచిబట్టలేసుకుని ... టై కట్టుకుని...అద్దంలో చూచుకున్నాడు. చిన్నగా పెరిగిన గడ్డం... తెల్లకళ్ళద్దాలు...నల్లగా గాలికి కదులుతున్న క్రాపు... ఎర్రని ముఖం. ఎవరు చూచినా తనను అందమైనవాడనే అంటారు.

యిక రేపటినుండి తను డాక్టరై...తను అమ్మా నాన్నా అందరూ ఉన్నవానిగా....యింకా...ఓహ్-లోకం అప్పుడే అలంకి

రించుకున్న నవవధువులా కనబడింది.

బయటికొచ్చి రిక్షా ఎక్కాడు.

రాజబహద్దూర్ మార్గ్ దగ్గరదిగి–లోపలి సందులోకి నడుస్తూ...

వాడవిండా అన్నీ పెంకుటిండ్లు...సగం కూలిపోయినవి. సగం తప్పులు విరిగినవి....ఎక్కువగా మనుషులు కనిపించడంలేదు. విరిగి పోయిన వీధి కుళాయిదగ్గర మాసిపోయిన ఆడమనుషులు కొట్లాడు కుంటున్నారు. వాళ్ళబట్టలు చిరిగిపోయి...జుట్టుమాసిపోయి, బురదలో ముంచితీసిన మనుష్యుల్లా అసహ్యంగా ఉన్నారు.

మునిసిపాలిటీ కాలువ పాడైపోయి మురికినీళ్ళన్నీ వీధిలోకి వొచ్చుకొచ్చి....పందులు బురదలో మూతులతో కుమ్ముతూ, యీగలు జుయ్‌మని ముసురుతూ—వాడవాడంతా భూమి వీపుపై కుళ్ళిపోయిన పుండులా ఉంది.

అక్కడక్కడ గజ్జికుక్కలు...లివర్ రోగానికి మందుతాలూకు అడ్వర్టయిజ్‌మెంట్స్‌పై బొమ్మల్లా ఒక్కకడుపే ఉండి కాళ్ళు చేతులూ కట్టెపేళ్ళలా ఉన్న పిల్లలు...

నడుస్తున్నాడు శివకుమార్. అతనికి తను మరో లోకంలోకి నడచివస్తున్నట్లుగా ఉంది. వీధిచివరన కూలిపోయిన మొండిగోడలతో. విరిగిపోయినసున్నపు అక్షరాలతో... 'సుం...రి...సత్రం' కనబడింది, లోపలినుండి పొగతేలివస్తోంది గాలిలోకి. బయట బోడి బావిదగ్గర ఎవరో ఓ ఆడమనిషి నెత్తిపైనుండి కొంగుకప్పుకుని నీళ్ళుతోడు తోంది. మనుషులెవరూ కనిపించడంలేదు బయట.

నడిచాడు లోపలికి.

నేలపైన విరిగిపోయిన షాబాద్‌రాళ్లు అక్కడక్కడ పరుచుకుని

వవ్వుతున్నాయి. పైన కప్పు విరిగిపోయి ఆకాశం ముక్కలు తెల్లగా కనబడుతున్నాయి. ఓ మూలకు పొయ్యి జబ్బుచేసిన మంటలతో సన్నగా వెలుగుతోంది.

చటుక్కున శివకుమార్ ఒళ్ళు జల్లుమంది. భయపడ్డాడు నిద్రలో దయ్యాల్ని చూచిన పసివానిలా. మసకచీకటిలో .... తేమగా.... రొచ్చులో....గుహలాఉన్న ఆ శిథిలమైన యింటిలో...

ఓ మూల—గుంపుగా...వాళ్ళంతా ఎవరు...ఎవరు...

భయంకరంగా....వికారంగా....ఏ రాక్షసుడో సగం సగం తిని విసిరేసిన మనుష్యుల్లా ... కొందరు ముఖాలపై ముక్కులులేక-యిం కొందరు పెదవులులేక...చేతులులేక....చేతులున్నా వాటికి వ్రేళ్ళులేక- పీళ్ళలో నాచ్చితీసిన మనుషుల్లా కొందరు....చెదపురుగులు కొరుక్కుని తినగా మిగిలిన మాంసపుముద్దల్లా మరికొందరు-యీగలు ముసురుతూ.... చీముకారుతూ ... చేతులకు చిరిగిపోయిన బాండేజి గుడ్డముక్కలను చుట్టుకుని—

కుష్ఠు...కుష్ఠు...కుష్ఠురోగులు వీళ్ళంతా.

అసహ్యంగా...భయంకరంగా....ఛండాలంగా—

మనసు అసహ్యంతో ఉండలుచుట్టుకుపోతుంది. వీళ్ళంతా ఎవరు....ఎవరు....తనను ఎందుకు రమ్మన్నారిక్కడికి.

అంతా వాసన...కంపు వాసన...భరించరాని పాడువాసన.

వీళ్ళంతా కదులుతున్న శవాల్లా—ఏమిటిది....ఏమిటిది.

అలాగే చూస్తున్నాడు కొయ్యబారిపోయి.

ఓ కుక్క...గజ్జికుక్క అతనిదగ్గరగా వచ్చి ప్రక్కనవిలబడి సగం తెగిపోయిన మొండితోక నాడిస్తోంది వికారంగా.

ప్రక్కన గోడకు ఆనించి ఓ కాన్వాసు బోర్డుంది ఎర్రగా "ధర్మం చేయండి" అన్న అక్షరాలతో. అక్కడే కుష్ఠురోగులు అడుక్కునేప్పుడు ఊపే గజ్జెల పరికరాలు, రంధ్రాలుపడ్డ కాన్వాసుబూట్లు, మాసిన జిడ్డుటోపీలు ఉన్నాయి.

"మీరంతా ఎవరు___"

ఎవరూ మాట్లాడలేదు. భయంభయంగా చూస్తున్నారు.

"ఎవరు మీరంతా___" అతనికి ఒళ్లు తిరుగుతున్నట్టుగా, కళ్లు తేలిపోతున్నట్టుగా అనిపిస్తోంది.

"......" వాళ్ళ కళ్ళు ఒట్టి పాలరాళ్లలా ఉన్నాయి.

"చెప్పండి" అరిచాడు అసహనంగా. కంపర మెత్తుతోందతనికి.

"నీ వాళ్ళం___" ..."నో".

"నీ వాళ్ళమే" "నో నో-వీళ్లేదు"

"యిదిగో-యితను నీ తండ్రి నరసింహం...ఆమె నీ తల్లి.... విధిచే వంచించబడ్డవాళ్ళం"

"నో...నో....నో..." ముఖాన్ని దోసిట్లో పెట్టుకున్నాడు. దుఃఖం సముద్రంలా పొంగుతోంది.

"వాళ్ళకు పుట్టిన విన్ను వాళ్ళతోనే ఉంచుకుంటే నువ్వూ మాలో ఒకడై పోతావని అందరం కలిసి మాకు దూరంగా విన్ను దేవునిలా పెంచుతున్నాం."

"......" కళ్ళలోనుండి నీళ్ళు కరిగిన నిప్పులా కారుతున్నాయి.

"నువ్వుకూడా మాలా కావద్దన్నదే మా ఆశ...మా ఆశను తీర్చుకునేందుకు యింతమందిమి కలిసి మా సర్వస్వాన్ని ధారపోశాం."

"....." తలెత్తి తండ్రిగా చూపించబడ్డ మనిషి దిక్కు చూశాడు. అతనింకా భయంకరంగా ఉన్నాడు కుళ్ళిపోయి అతని ప్రక్కనే ఒదిగొదిగి కూర్చున్న ఆమె-తల్లి... తనను కన్నతల్లి... యిద్దరూ చూస్తున్నారు భయం భయంగా.... కళ్లనిండా నీళ్ళతోవాళ్ళ ముఖాల్లో భావంలేదు. మెడలు తెగిన పక్షుల్లా ఆశలు తన్నుకుంటున్నాయి.

"బాబూ — మేము విరిగిన రథచక్రాలం. మా హృదయా లన్నింటినీ కలిపి నిన్ను నడిచే చక్రంగా చేసుకుని నీవెంట నడవా లనుకున్నాం. అందుకే-యింతమందిమి కలిసి మా కడుపులను చంపుకుని, యీ మా పాడుకథ నీకు తెలియకుండా నిన్ను డాక్టర్‌ను చేసుకున్నాం. డాక్టర్‌గా మాకు నీ అవసరముంది. నీ హృదయం మాకు తెలుసు." యింకా ఏదో చెబుతున్నాడు తండ్రి అనబడే ఆ మనిషి.

తను యిన్నాళ్లూ తిన్న డబ్బు వీళ్లు అడుక్కుని తనకు పంపిందా, ఆ డబ్బు. ఆ అసహ్యమైన డబ్బు.... చీమూ. నెత్తురూ, మరకలతో నలిగిన ఆ నోట్లలోనుండి తను పెరిగి—

కాని తను — ఆ అసహ్యంలో, ఆ చీకటి గుహలో, ఆ కంపులో.... ఆ చెదలుపట్టిన మనుషులతో—ఉండగలడా...

"నో నో" మనసు మూల్గుతోంది.

"బాబూ — నువ్వే మాటీపావివి. నువ్వు డాక్టర్‌వై మాలో కొందరినైనా కాపాడాలి."

"నో నో" "నాకు తెలుసు-నువ్వు మమ్మల్ని అర్థం చేసుకుంటావు చేసుకుని..."

"నో ... నో ... నేనీ నరకంలో ఉండలేను .... మీ మనిషిగా బ్రతకలేను అసలు నేను మీకు పుట్టానని చెప్పుకోవడమే సిగ్గు... సిగ్గు... సిగ్గు"

వెనక్కి తిరిగి పరుగెత్తుతున్నాడు శివకుమార్ పిచ్చివానిలా.